క్లుప్తంగా

స్టోరేజీ పాయింట్‌కు చేరిన పాఠ్య పుస్తకాలు

కొలిమిగుండ్ల: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రభుత్వం పాఠ్య పుస్తకాలను మంజూరు చేసింది. గతానికి భిన్నంగా ఈసారి మండల కేంద్రాల్లో స్టోరేజీ పాయింట్లు ఏర్పాటు చేశారు. కొలిమిగుండ్లలోని ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్టోరేజీ పాయింట్‌కు మంగళవారం పాఠ్య పుస్తకాలు చేరాయి. మండలానికి 15,370 పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ జిలానీ బాషా తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజే ప్రతి విద్యార్థికి పుస్తకాలు అందించేలాచర్యలు తీసుకుంటున్నామన్నారు.

వైఎస్సార్ బీమా సాయం అందజేత



బాధితకుటుంబానికి నగదుఅందజేస్తున్న దృశ్యం

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురం గ్రామానికి చెందిన పులసాని చంద్రశేఖర్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మరణించాడు. బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ. 10 వేలను సర్పంచ్ ప్రమీలమ్మ, గ్రామ వైఎస్సార్ నాయకులు భరత్ కుమార్ రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రంగస్వామి, వెల్ఫేర్ అసిస్టెంట్ షాహీణ, వలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు

కొలిమిగుండ్ల: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. మంగళవారం బెలుం సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. అంగన్‌వాడీలోని 0–5 ఏళ్లలోపు పిల్లలకు ఆధార్ నమోదు చేసి ఆధార్ కార్డులు అందించనున్నట్లు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 992 మంది చిన్నారులకు ఆధార్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆయా సచివాలయాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆధార్ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు.

ఇంటింటికీ తాగునీటి కుళాయి

బేతంచెర్ల:మండల వ్యాప్తంగా రానున్న రోజుల్లో ఇంటింటికీ తాగునీటి కొళాయి కనెక్షన్ ఇచ్చి గోరుకల్లు రిజర్వాయర్ నుంచి వచ్చే శుద్ధమైన తాగునీరు అందజేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్‌రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం వెంకటగిరి గ్రామం నుంచి ఎం.పేండేకల్లు గ్రామం వరకు నూతనంగా వేస్తున్న పైపులైన్ నిర్మాణ పనులను ఇంజినీర్ పరిశీలించారు.

మహిళను బెదిరించిన వ్యక్తిపై కేసు

సంజామల(కోవెలకుంట్ల): సంజామల మండలం అక్కంపల్లె గ్రామానికి చెందిన ఓ మహిళను పొలం రస్తా విషయంలో బెదిరించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ప్రతాప్ తెలిపారు. ఎస్‌ఐ సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన రమాదేవి పొలంలోకి వెళ్లకుండా ఆమె బావ వెంకటేశ్వరరెడ్డి అడ్డుకోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉచితంగా జొన్నల పంపిణీ



జొన్నలు పంపిణీ చేస్తున్న యాగంటి ఆలయ చైర్మన్ బుచ్చిరెడ్డి

బనగానపల్లెరూరల్: రేషన్‌కార్డుదారులకు ప్రభుత్వం ఉచితంగా జొన్నలు పంపిణీ చేస్తున్న కార్యక్రమాన్ని మంగళవారం మండలంలో ని మీరాపురంలో యాగంటి ఆలయ చైర్మన్ తొటబుచ్చిరెడ్డి ప్రారంభించారు.బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని పైలెట్ ప్రాజెక్టుగా మన జిల్లా లోని రేషన్‌కార్డుదారులకు కిలో జొన్నలు ఉచి తంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

పందుల తరలింపునకు 11వతేదీ వరకు గడువు

కోవెలకుంట్ల: మేజర్ గ్రామ పంచాయతీ కోవెలకుంట్ల పరిధిలో సంచరిస్తున్న పందులను జనావాసాలకు దూరంగా తరలించేందుకు యజమాన్యాలకు గడువు ఇస్తున్నట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో మంగళవారం పందుల పెంపకందారులతో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. పందుల సంచారంతో సోకే ప్రాణాంతక వ్యాధులు, పారిశుద్ధ్యం లోపించడం వంటి కారణాలతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గత నెలాఖరులోగా పందులను తరలించాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. పందుల పెంపకందారులు మరికొన్ని రోజులు గడువు కోరడంతో ఈ నెల 11వ తేదీ వరకు గడువు ఇస్తున్నామని, పందులను పట్టణంలో సంచరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ వెంకటరెడ్డి, ఈఓపీఆర్డీ రాధిక, మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ

డోన్‌లో మంత్రి విస్తృత పర్యటన



రైల్వేస్టేషన్ రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్: ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్యతో కలసి మంగళవారం డోన్ పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. అభివృద్ధి పనులను స్వయంగా పరిశీలించారు. రూ.10 కోట్లతో నిర్మిస్తున్న కూరగాయల మార్కెట్ భవనం, రూ.8 కోట్లతో నిర్మించిన మున్సిపల్ పరిపాలనా భవనం, రూ.2 కోట్లతో నిర్మించిన రామసుబ్బయ్య పార్కు, రూ.4 కోట్లతో నిర్మించిన బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి పనుల తీరుపై ఆరా తీశారు. అదేవిధంగాపాత బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రూ.4 కోట్లతో చేపట్టిన రోడ్డు వెడల్పు పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి అధికారులకు సూచించారు.

ఏపీఐఐసీసీ డైరెక్టర్ మర్రి గోవిందరాజును పరామర్శించిన మంత్రి

ఇటీవల డోన్ పట్టణానికి చెందిన మర్రి గోవిందరాజు సతీమణి శ్రీదేవి మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి మంగళవారం మర్రి గోవిందరాజు స్వగృహానికి వెళ్లి గోవిందరాజుతో పాటు ఆయన తండ్రి, రైల్వే కార్మిక సంఘం నాయకులు మర్రి రాఘవయ్యను పరామర్శించారు. మంత్రి వెంట ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేశ్ తదితరులు ఉన్నారు.

నేడు ప్యాపిలిలో మంత్రి బుగ్గన పర్యటన

ప్యాపిలి: ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి బుధవారం ప్యాపిలి మండలంలో పర్యటించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి. బుధవారం ఉదయం 10–30 గంటలకు స్థానిక బోరెడ్డి పుల్లారెడ్డి ఫ్యాక్టరీ వద్ద కార్యకర్తలతో మంత్రి సమావేశం కానున్నారు. సాయంత్రం 4 గంటలకు చంద్రపల్లె నుంచి పీఆర్ పల్లె వరకు కొత్తగా వేసిన రోడ్డుపై మంత్రి పాదయాత్ర చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.



నూతనంగా నిర్మించిన శేషారెడ్డి ఇండోర్ స్టేడియాన్ని పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన



మున్సిపల్ పరిపాలన నూతన భవనాన్ని పరిశీలిస్తున్న మంత్రి బుగ్గన

శ్మశాన వాటికలకు స్థలాలు గుర్తించండి

● జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్‌జిలానీ శామూన్

నంద్యాల: జిల్లాలోని మండలాల్లో ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు స్థలాలను అన్వేషించి వారం రోజుల్లో నివేదిక అందజేయాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తహసీల్దార్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో భూసేకరణ, పీఓఎల్‌ఆర్ రీ సర్వే, ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర రెవెన్యూ అంశాలపై జాయింట్ కలెక్టర్ టి.నిశాంతితో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నందికొట్కూరు, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి, బనగానపల్లె తదితర మండలాల్లోని గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీల శ్మశాన వాటికలకు స్థలాలు గుర్తించి నివేదిక అందజేయాలన్నారు. చెంచుగూడెంలలో పెండింగ్ ఉన్న రేషన్ కార్డులు, ఏఏవై, ఆధార్ కార్డులు వారంలో పూర్తి చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న మ్యూటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్లకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. రీ సర్వే కార్యక్రమాన్ని పారదర్శకంగా, వేగంగా గడువులోపు పూర్తి చేయాలని మండల సర్వేయర్లను, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ శ్రీరాంను ఆదేశించారు. చుక్కల భూములకు సంబంధించిన భూములను సబ్ డివిజన్ చేసి సమర్పించాలని చెప్పారు. పర్యాటక ప్రాంతాలు, జాతీయ రహదారులకు సంబంధించిన భూసేకరణను త్వరగా పూర్తి చేయాలన్నారు. జేసీ మాట్లాడుతూ ల్యాండ్ కన్వర్షన్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న వాటిని వెంటనే క్లియర్ చేయాలన్నారు. ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ కామేశ్వరరావు, నంద్యాల, డోన్, ఆత్మకూరు ఆర్‌డీఓలు శ్రీనివాసులు, వెంకట్‌రెడ్డి, ఎం.దాసు, తహసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పింఛన్ పంపిణీలో బనగానపల్లె మొదటి స్థానం

బనగానపల్లెరూరల్: వైఎస్సార్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో బనగానపల్లె మండలం నంద్యాల జిల్లాలో మొదటి స్థానం వచ్చిందని ఎంపీడీఓ శివరామయ్య తెలిపారు. మే నెలకు సంబంధించి మండలంలో 12,259 మంది లబ్ధిదారులు ఉండగా మంగళవారం సాయంత్రానికి 11,938 మందికి వలంటీర్లు నగదు అందజేసి 97.38 శాతం పూర్తి చేశారన్నారు. వివిధ కారణాలతో గ్రామాల్లోని అందుబాటులోలేని 329 మంది లబ్ధిదారులకు త్వరలో పింఛన్ నగదు అందజేస్తామని తెలిపారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపండి

డోన్ టౌన్ : మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామంలో తలెత్తిన నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సోంటి పులిశేఖర్ కోరారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈవోఆర్డీకి వినతి పత్రం అందజేశారు. నీటి సమస్యను పరిష్కరించాలని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో దళిత కులాల పోరాట సమితి జిల్లా నాయకులు ప్రభాకర్, సీపీఐ నాయకులు పుల్లయ్య, రాంమోహన్, విజయ్, సిద్ధు, శివన్న తదితరులు పాల్గొన్నారు.

8న ప్రభుత్వ ఐటీఐలో అప్రెంటిషిప్ మేళా

డోన్ టౌన్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 8వ తేదీన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిషిప్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్స్‌పాల్ రాయపురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు వివిధ కంపెనీలు, ఇండస్ట్రీస్ ప్రతినిధులు హాజరవుతారని, జిల్లాలో ఐటీఐ పాసైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అప్రెంటిషిప్ కోసం రిజిస్ట్రేషన్ నమోదు చేసుకోని అభ్యర్థులు స్థానిక ఐటీఐలో సంప్రదించి పూర్తి చేసుకోవాలని సూచించారు. విద్యార్హత సర్టిఫికెట్లు, పాస్ ఫొటో, ఆధార్‌కార్డుతో హాజరు కావాలని ఆయన తెలిపారు.

93 శాతం పింఛన్ల పంపిణీ

కొలిమిగుండ్ల: మండల వ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది. మంగళవారం సాయంత్రం నాటికి 93.77 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల తదితర పింఛన్ దారులు మొత్తం 6966 మందికిగాను వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి 6532 మంది నగదు అందజేశారన్నారు.

వీడని అకాల వర్షాలు !

కోవెలకుంట్ల: వేసవిలో అకాల వర్షాల పరంపర కొనసాగుతోంది. మంగళవారం రాత్రి స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉండి వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుంది. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ మండలాల్లోని పలు ప్రాంతాల్లో వర్షం పడింది. అకాల వర్షాలు ప్రజలకు వేసవి నుంచి ఉపశమనం కలిగినా వరి, మిరప రైతులకు నష్టం చేకూరుస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

ఆధ్యాత్మికం



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ

డోన్ : మండలంలోని చింతలపేట గ్రామంలో ఐదేళ్లకొకసారి నిర్వహించే గంగమ్మ జాతరను మంగళవారం గంగపుత్రులు ఘనంగా నిర్వహించారు. గంగపుత్రులు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించారు. మహిళలు సామూహికంగా పెద్దఎత్తున బోనాలు తీసుకెళ్లి గంగమ్మకు సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి జంతు బలి ఇచ్చారు.

ఘనంగా ఎల్లమ్మ జాతర

బేతంచెర్ల: పట్టణంలోని సుబ్బారెడ్డి నగర్‌లోని బుడిబుడకల కులస్తులు గిడ్డయ్య, నాగరాజు, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వైశాఖ మాసం మంగళవారం ను పురస్కరించుకొనిఎల్లమ్మకు ప్రత్యేకపూజలు చేశారు. ఉద యం కాలనీలో వెలసిన ఎల్లమ్మకు పంచామృతాభిషేకం,కుంకుమార్చన, మహామంగళహారతి నిర్వహించారు.అనంతరం కాలనీల్లోని మహిళలు బోణాలతో ఊరేగింపుగా వచ్చిఅమ్మవారికి సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

పుట్ట పెద్దమ్మ పూజలు

బేతంచెర్ల: స్థానిక బనగానపల్లె రహదారిలో వెలసిన పుట్ట పెద్దమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, కుంకుమార్చన,మహామంగళ హారతి నిర్వహించారు. అలాగే అమ్మవారిశాలలో వాసవీ మాతకు, కొలుములపల్లె రహదారిలోని చౌడేశ్వరీ దేవికి, సిమెంట్ నగర్‌లో వెలసిన సుంకులా పరమేశ్వ రీ అమ్మవారికి భక్తులు ప్రత్యేకపూజలు చేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు

డోన్ టౌన్:పట్టణంలోని శ్రీతత్వమసి అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తరా నక్షత్రం పురస్కరించుకుని ఉదయం అభిషేకాలు, అర్చనలు, మహా మంగళ హారతులు తదితర ప్రత్యేక పూజలను ఆలయ ప్రధాన అర్చకులు చంద్రమౌళీశ్వర స్వామిఆధ్వర్యంలో జరిగాయి. భక్తు లు అయ్యప్ప స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

కనుల పండువగా గ్రామోత్సవం

ప్యాపిలి: మండల పరిధిలోని మామిళ్లపల్లె గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం గణపతి పూజ, మూలమంత్ర జపాలు, హోమాలు, దివ్యాధివాసం, మహా మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం గ్రామోత్సవాన్ని కనుల పండువగా సాగింది.

పెద్దమ్మ దేవర ప్రారంభం

బనగానపల్లెరూరల్: మండలంలోని పెద్దరాజుపాళెం, కృష్ణగిరి గ్రామాల్లో గ్రామ పెద్దలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం పెద్దమ్మ దేవర ప్రారంభమైంది. సుందరంగా తయారు చేసిన పెద్దమ్మ ప్రతిమను ఉరేగింపుగా తీసుకొచ్చి ఆ గ్రామాల్లో నడిబోడ్డున ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపాల్లో ఆశీనులను గావించారు. చాల ఏళ్ల తర్వాత ఒకే రోజు రెండు గ్రామాల్లో దేవర నిర్వహిస్తుండడంతో బంధువులతో నిండిపోయాయి. అమ్మవార్లను దర్శించుకునేందుకు రాజకీయ నాయకులు, ప్రముఖులు తరలిరానున్న నేపథ్యంలో బనగానపల్లె ఇన్‌చార్జ్ సీఐ ప్రియతంరెడ్డి భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్యాపిలి: స్థానిక సాయిబాబా దేవాలయంలో ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. మూడు రోజుల పాటు సాగిన వేడుకల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ముగింపు రోజు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులతో పాటు సాయిభక్త సమాజం వారు అన్నదాన కార్యక్రమంలో తమవంతు సేవలు అందించారు.

ప్రారంభమైన టీటీడీ ధార్మిక కార్యక్రమాలు

బేతంచెర్ల: మండలంలోని యంబాయిలో శ్రీ ఆంజనేయ, చెన్నకేశవస్వామి ఆలయంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకట్ రెడ్డి మాట్లాడారు. గ్రామ గ్రామానా భక్తి చైతన్యం కల్గించే ఉద్దేశంతో శ్రీ మద్రామాయణం, మహాభారతం, భగవద్గీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పవనయ్య, సుధాకర్, సుభాన్, బాలస్వామి నాయుడు, రామకృష్ణ, ఏకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వాణిశ్రీ

ప్యాపిలి: ఆశావర్కర్లు తమ పరిధిలో ఉన్న గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్రమం తప్పకుండా పర్యవేక్షించాలని వైద్యాధికారిణి వాణిశ్రీ ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారంఆశా వర్కర్లతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. రక్తహీనతతో బాధ పడుతున్న గర్భిణులకు దగ్గర ఉండి ఐరన్ మాత్రలు వేయాలన్నారు. ప్రసవ తేదీ మేరకు వారు వెళ్లే ఆసుపత్రిని ముందుగానే మ్యాపింగ్ చేయాలన్నారు. అక్కడి ఆశా వర్కర్లతో మాట్లాడి ప్రసవం సమయంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో వచ్చే ఓపీల విషయంలోనూ ఆశా వర్కర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. అదేవిధంగా టీబీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించి సమీపంలోని పీహెచ్‌సీలకు వారిని రెఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు విజయకుమారి, రాఘవేంద్రగౌడ్, గంగాదేవి, యశోద తదితరులు పాల్గొన్నారు.

దాచూరి ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

డోన్ టౌన్ : దాచూరి రామిరెడ్డి ఉద్యమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ గౌరవ అధ్యక్షుడు నరసింహులు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక పాతపేట హైస్కూల్లో దాచూరి వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాచూరి ఉపాధ్యాయ ఉద్యమ నేతగా యూటీఎఫ్ ఆవిర్భావం నుంచి సేవలందించారని గుర్తుచేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి మాణిక్యంశెట్టి, యూటీఎఫ్ నాయకులు బాబు, సుబ్బరాయుడు, రాజశేఖర్, లతీఫ్, సర్వజ్ఞమూర్తి, క్రిష్ణనాయక్, రఘు నాయక్, చంద్రమోహన్, రాజా కుల్లాయప్ప, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్స్ షాపులో చోరీ

డోన్ టౌన్ : పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్‌లోని మాబు ఎలక్ట్రానిక్స్ షాపులో గుర్తు తెలియని దుండగులు సోమవారం రాత్రి చోరీకి పాల్పడినట్లు యజమాని మాబు మంగళవారం తెలిపారు. యథావిధిగా రాత్రి దుకాణాన్ని మూసి వేసి ఇంటికి వెళ్లానన్నారు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా తాళం పగలి ఉందని, షాపు తెరచి చూస్తే సామాన్లు చిందరవందరంగా పడివేశారన్నారు. రూ.5వేలు మాత్రం తీసుకెళ్లినట్లు ఆయన తెలిపారు. ఈ విషయంపై పట్టణ పోలీసులను అడుగగా ఇంకా విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా గంగమ్మ జాతర



అమ్మవారికి సమర్పించేందుకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు



పెద్దమ్మను దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు



అయ్యప్పస్వామి మెట్లకు పూజలు చేసిన దృశ్యం

కొనసాగుతున్న పాండురంగడి బ్రహ్మోత్సవాలు

కోవెలకుంట్ల: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నా యి.మంగళవారం ఆలయ అర్చకులు వేణు గోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్య ంలో పంచామృతాభిషేకం, నూతన వస్త్ర అ లంకరణ, విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణ ం, మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. అలాగే స్వామివారికి విశ్వక్సేన ఆరాధన,పుణ్యాహవచనం ,ఆలయశుద్ధి,పుట్టమన్ను తెచ్చుట, మండపారాధాన, మహా కలశస్థాపన అంకురపూజ, ధ్వజారోహణం, బేరి పూజ, తదితర కార్యక్రమాలు చేపట్టారు.పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. బుధ వారం అర్ధరాత్రి నుంచి స్వామివారి కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి తెలిపారు.





యు కొత్తపల్లె గ్రామంలో రూ.17.50లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ క్లినిక్ భవనం, డోన్ పట్టణంలో రూ.3కోట్లతో నిర్మించిన ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్

ప్రభుత్వ భవనాలు ముస్తాబు!

డోన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు డోన్ మోడల్ నియోజకవర్గంగా రూపుదిద్దుకుంటుంది. ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు విరివిగా మంజూరువుతుండడంతో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయి. సీసీ రోడ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, భవనాలు, సచివాలయ, ఆర్బీకే, విలేజ్ క్లీనిక్ భవన నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో యు కొత్తపల్లె గ్రామంలో రూ.17.50లక్షల వ్యయంతో నిర్మించిన విలేజ్ క్లినిక్, రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాలు పూర్తయ్యాయి. త్వరలో ప్రారభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సర్పంచ్ వై విద్య తెలిపారు. అదేవిధంగా పట్టణంలోని ఆర్‌అండ్‌బీ కార్యాలయం ఆవరణలో రూ.3కోట్లతో నిర్మించిన ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ప్రారంభోత్సవానికి ముస్తాబవుతోంది. అన్ని హంగులతో నిర్మించిన భవనాలతో గ్రామాల్లో కొత్త శోభ సంతరించుకుంది.



రూ.40లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం

నేటి నుంచి చెన్నకేశవ స్వామి తిరుకల్యాణోత్సవాలు

అవుకు:మండల కేంద్రం అవుకులో వెలసిన శ్రీ భూలక్ష్మీ సమేత చెన్నకేశవ స్వామి తిరుకల్యాణ మ హోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయని రైతు సంఘం పెద్దలు మంగళవారం తెలిపారు. రాత్రికి సంకల్పం, పుణ్యాహవచనం, ద్వజారోహణం,మృత్సంగ్రహణం, అంకురార్పణ, కలశ స్థాపనాదుల కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 4వ తేదీ వేకువజామున స్వా మివారి కల్యాణం అంగరంగ వైభవంగా జరుగనుంది. అదే రోజు రాత్రి స్వామి అమ్మవార్లకు హనుమంతు వాహనంపై ట్టణ పురవీధుల్లో పల్లకీ సేవ నిర్వహిస్తామని పెద్దలు తెలిపారు. 5వ తేదీన సింహ వాహనముపై, 6న శేష వాహనముపై,7న గరుడ వాహనముపై, 8వ తేదీన గజవాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిస్తారన్నారు. 9,10వ తేదీల్లో రథోత్సవం ఉంటుందన్నారు. 10వ తేదీన దివంగతనేత చల్లా రామక్రిష్ణారెడ్డి పెద్ద కుమారుడు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఎద్దులు బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు రైతు సంఘం పెద్దలు తెలిపారు.

5 నుంచి ఉరుసు

ప్యాపిలి: మండల పరిధిలోని మునిమడుగు గ్రామంలో ఈ నెల 5వ తేదీ నుంచి ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు మంగళవారం తెలిపారు. గ్రామంలో వెలసిన హజరత్ సయ్యద్‌నా మహమ్మద్ గౌస్ దాదావలి సాహెబ్ దర్గాలో 5వ తేదీ జెండానిషాని, 6న గంధం, 7న ఉరుసు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శనివారం రాత్రి, ఆదివారం మధ్యాహ్నం దర్గా ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కుమారస్వామికి విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.